

కథా కౌముది

## గడియారం - అబ్రకదబ్ర

వాళ్ళ స్నేహం వయసు రెండేళ్ళు. రెడ్డి ఉంటున్న అద్దె గదిలో సీతారామ్ సహ రూమ్మేట్‌గా చేరటంతో మొదలయిందది. అప్పుడే ఉద్యోగ వేటలో రాజధానికొచ్చాడు సీతారామ్. అప్పటికే ఏడాదిగా రెడ్డి ఏవో వ్యాపార ప్రయత్నాలు చేస్తూ అదే గదిలో ఉంటున్నాడు. ఇద్దరూ సమవయస్కులు కావటం, అనేక విషయాల్లో ఇద్దరి అభిరుచులూ కలవటంతో స్నేహం బలపడటానికి ఎక్కువ కాలం పట్టలేదు.

ఇతరత్రా ఇద్దరి భావాలూ కలిసినా, ఒక విషయంలో మాత్రం ఇద్దరివీ భిన్న ధృవాలు. సీతారామ్‌కి జాతకాల పిచ్చెక్కువ. హస్తసాముద్రికం నుండి నాడీజోస్యం, న్యుమరాలజీ దాకా అతనికి నమ్మకం లేని పద్ధతి లేదు. రెడ్డి దృష్టిలో ఇలాంటివి మూఢనమ్మకాలు. ఎదగటానికి కావల్సింది బుద్ధిబలమే కానీ జాతకబలం కాదని అతని నమ్మకం. జాతకాలు, జ్యోతిష్యాల ప్రస్తావనొచ్చినప్పుడల్లా మిత్రులిద్దరి మధ్యా గంటలకొద్దీ వాదోపవాదాలు జరిగేవి. రెండు సంవత్సరాలు, రెండు డజన్ల సంవాదాల అనంతరం ఈ విషయంలో వాళ్ళ దృక్కోణాలు మరింత ఇరుకయ్యాయే కానీ ఇసుమంత కూడా మారలేదు. ఐతే ఆ మాత్రం భిన్నాభిప్రాయాలు వాళ్ళ స్నేహానికెప్పుడూ అడ్డురాలేదు.

ఏడాది క్రితం సీతారామ్‌కి నగరంలోనే ఓ బుల్లి సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగమొచ్చింది. జీతం ఫర్వాలేదు - అతని ఖర్చులకి సరిపోతుంది. మరో పక్క - మొదలెట్టిన రెండున్నరేళ్ళ తర్వాత కూడా రెడ్డి వ్యాపార ప్రయత్నాలు రెడ్డొచ్చె మొదలాడె తీరులోనే ఉన్నాయి. ఏ వ్యాపారం చేద్దామన్నా పెట్టుబడిక్కావల్సిన డబ్బు లేకపోవటం అతని ప్రధాన సమస్య. కొన్నాళ్ళుగా రియల్ ఎస్టేట్ రంగంలో కాలు పెడదామని విశ్వప్రయత్నాలు చేస్తున్నాడతను. ఇందులో ఐతే మాటకారితనమే పెద్ద పెట్టుబడని విని ఇటొచ్చాడు కానీ తీరా వచ్చాక ఇక్కడా డబ్బుతోనే పనని తెలిసి డీలా పడిపోయాడు. ఐనా భూమ్యాకాశాలని ఏకం చేసేస్తున్న రియల్ ఎస్టేట్ బూమ్ సాహసం సేయరా అంటూ ఊరిస్తుంటే తన భాగ్యం అందులోనే వెదుక్కోవాలని నిర్ణయించుకున్నాడతను. కనీసం పది లక్షల పెట్టుబడితో వస్తే పార్ట్‌నర్‌గా చేర్చుకుంటాననొక ఛోటా రియల్టర్ హామీ ఇస్తే రెండు నెలలుగా అప్పు కోసం చెప్పులరగదీస్తున్నాడు. సీతారామ్‌కి స్నేహితుడిని ఆదుకోవాలనే ఉంది కానీ అతని బ్యాంక్ బాలెన్స్ అంతంత మాత్రమే.

ఉరుకులు పరుగుల ఉద్యోగంలో సీతారామ్, అప్పుల వేటలో రెడ్డి బిజీ ఐపోవటంతో నాలుగైదు నెలలుగా వాళ్ళు తీరికగా మాట్లాడుకోవటం అరుదైపోయింది. పేరుకి రూమ్మేట్లే అయినా కొన్నాళ్ళుగా ముఖాముఖీ కాకుండా ఫోన్లలో మాట్లాడుకోవటం

ఎక్కువైపోయింది. ఈ మధ్యాహ్నం కూడా అలాగే సీతారామ్ ఫోన్ చేస్తే ఎత్తాడు రెడ్డి. 'ఓ విశేషముంది. గంటలో ఫలానా ఇరానీ హోటల్‌కి రారా' అని చెప్పి అంతకన్నా వివరాలివ్వకుండా పెట్టేశాడు సీతారామ్.

చెప్పిన టైమ్‌కి పది నిమిషాలు ఆలస్యంగా అక్కడికెళ్ళాడు రెడ్డి. అతనెప్పుడూ అంతే. మిగతా విషయాల్లో ఎలాగున్నా సమయపాలన విషయంలో మాత్రం రెడ్డి నిఖార్సైన భారతీయుడు. సీతారామ్ దీనికి పూర్తి భిన్నం. ఆలస్యం అతని నిఘంటువులో లేని పదం. పంక్చువాలిటీ విషయంలో ఎంత నిక్కచ్చిగా ఉంటాడంటే, అతని గడియారం ఎప్పుడూ పదినిమిషాలు ముందుకి సెట్ చేసుంటుంది. రెడ్డికన్నా ఇరవై నిమిషాలు ముందొచ్చి ఇరానీ హోటల్ బయటే నిరీక్షిస్తున్నాడతను. వాళ్ళ రూమ్‌కి బాగా దూరమైనా, అక్కడ చాయ్ బాగుంటాయని అప్పుడప్పుడూ ఆ ఇరానీ హోటల్‌కి వస్తుంటారు ఇద్దరూ. ఆ పరిసరాలన్నీ బాగా పరిచయమున్నవే.

రెడ్డి రాగానే ఇద్దరూ హోటల్ లోపలకి వెళ్ళారు. ఓ మూలగా టేబుల్ చూసుక్కూర్చుని చాయ్ ఆర్డరిచ్చాక అడిగాడు రెడ్డి, ‘ఏంటి సంగతి? ఏదో విశేషమన్నావు?‘.

'చెప్తా, చెప్తా, కాసేపాగు' అతన్ని సస్పెన్స్‌లో పెడుతూ చిద్విలాసంగా చెప్పాడు సీతారామ్, ప్లాస్టిక్ కవరొకటి టేబుల్ మీద పెడుతూ.

రెడ్డి దృష్టి దానిమీద పడింది. కుతూహలంగా అడిగాడు ‘ఏంటది?‘

‘షేవింగ్ క్రీమ్‘

‘రూమ్‌లో చాలా ఉన్నట్లున్నాయిగా. కొత్తదెందుకు?‘ రెడ్డికి అర్థం కాలేదు.

‘బంపర్ ఆఫర్. అసలు ధరకే ఉచితంగా పాతికశాతం క్రీమ్ అదనం. అందుకే కొన్నా‘

రెడ్డికి నవ్వొచ్చింది. ‘అనుకున్నా, అలాంటిదేదో ఉంటుందని. కక్కుర్తి మహరాజ్.. వాడు ఉచితం అనగానే అవసరం లేకపోయినా కొనేయటమే!?‘

సీతారామ్ ఉడుక్కోలేదు. అలా ఏడిపించటం రెడ్డికి కొత్తకాదు. తన వంతొచ్చినప్పుడు రెడ్డినీ సీతారామ్ ఇలాగే ఆడుకుంటాడు. అవి వాళ్ళకి మామూలే.

‘నువ్వు మొదలెట్టకు నాయనా ఇప్పుడు. నీ క్లాస్ వినటానికి పిలవలేదు నిన్ను‘ భయం నటిస్తూ చెప్పాడు సీతారామ్. వ్యాపారిగా మారే క్రమంలో ఉండబట్టేమో - అవకాశమొచ్చినప్పుడల్లా వ్యాపారుల, వ్యాపారాల మాయలు వర్ణించే ఉపన్యాసాలివ్వడం రెడ్డికలవాటు.

అంతలో చాయ్ వచ్చింది. రెండు కప్పుల్లో పంచుకుని తాగారు. కాసేపు ఇద్దరి మధ్యా మౌనం.

‘రెడ్డీ, జాతకాల గురించి నీ అభిప్రాయమేంటి?' ఖాళీ కప్పుని టేబుల్ మీద తిప్పుతూ మౌనభంగం చేశాడు సీతారామ్. అతని దృష్టి కప్పు మీదనే ఉంది.

చిరాగ్గా చూసాడు రెడ్డి. 'ఇదడగటానికా పనులు మానుకు రమ్మంది? నీకు తెలీదా నా అభిప్రాయమేంటో?'

'తెలుసనుకో .. మళ్ళీ చెపితే విందామని' కప్పునే చూస్తూ అన్నాడు సీతారామ్.

'జరగబోయేది ముందే తెలుసుకోటం జరిగే పని కాదు', దృఢంగా ధ్వనించింది రెడ్డి గొంతు.

రెడ్డికేసి చూశాడు సీతారామ్. 'ఒకవేళ తెలుసుకుంటే?'

'ఎవడన్నా అలాగంటే వాడబద్ధమాడుతున్నట్లే.'

'అలాకాదు. నిజంగానే తెలుసుకునే శక్తి ఎవరికన్నా ఉంటే?'

'ఉంటే ఉండనీ. జరగబోయేది తెలుసుకుని చేసేదేమిటి?'

'ఏదన్నా ఉపయోగముండొచ్చు కదా'

'ఏం ఉపయోగం. నాకైతే దానివల్ల నాలుగు రకాల నష్టాలు కనిపిస్తాయి'

'నాలుగు రకాలే! ఏంటో?'

అప్పటిదాకా కుర్చీలో జారిగిలబడున్న రెడ్డి నిటారుగా సర్దుకుని కూర్చున్నాడు. వాదనలోకి దిగబోతున్నాడని దానర్ధం. సీతారామ్ మాత్రం కులాసాగానే కూర్చుని చూస్తున్నాడు.

'ఓకే. అడిగావు కదా. విను మరి', రెడ్డి గొంతు సవరించుకుని మొదలు పెట్టాడు. `ఉదాహరణకి, నీకో పది లక్షలకి లాటరీ తగులుతుందని చిలక జోస్యుడెవడో చెప్పాడనుకుందాం. ముందే తెలుసు కాబట్టి ఆ లాటరీ నిజంగా తగిలితే నీకు థ్రిల్లేముంటుంది? ఇది ఒకటో నష్టం. ఒకవేళ వాడు చెప్పింది తప్పైతే ఉసూరుమనాలి. ఇది రెండో రకం.''

'ఊఁ, మరి ఇంకో రెండు?'

'నీకేదో చెడు జరగబోతుందని ఆ చిలక జోస్యుడే చెప్పాడనుకుందాం. అది అబద్ధమైతే మంచిదే, కానీ అప్పటిదాకా అనవసరమైన టెన్షన్. ఒకవేళ వాడు చెప్పింది జరిగితే.... జరగబోయేదాన్ని ఎటూ ఆపలేం కాబట్టి దానిగురించి తల్చుకుంటూ ముందునుండే అనవసరంగా బాధపడాలి. ఇవీ మిగతా రెండు.'

'ఆగాగు. చెడు జరగబోనుందని ముందే తెలిస్తే ఏదోటి చేసి దాన్నాపొచ్చు కదా'

'జరగబోయేదాన్ని మార్చటం మన తరం కాదు తమ్మీ'

'ఎందుక్కాదు? భవిష్యత్తుని చూడటం సాధ్యమైతే దాన్ని మార్చటమూ సాధ్యమే', నమ్మకంగా చెప్పాడు సీతారామ్.

'అప్పుడా జోస్యం తప్పైనట్లు - అందులో చెప్పింది జరగలేదు కాబట్టి,' `దొరికావ్` అన్నట్లు గర్వంగా చూస్తూ చెప్పాడు రెడ్డి.

దీనికి సమాధానం రాలేదు సీతారామ్ దగ్గరనుండి. బదులిచ్చే ప్రయత్నం కూడా చెయ్యలేదతను. మౌనంగా చెయ్యెత్తి రిస్ట్ వాచ్ కేసి చూసుకున్నాడో సారి.

అతడి చర్యని గమనిస్తూ రెడ్డి మళ్ళీ గొంతు సవరించుకుని చెప్పాడు, `వింతగాలేదూ?`

ఏమిటన్నట్లు చూశాడు సీతారామ్.

రెడ్డి కొనసాగించాడు, `గడియారం - కాలాన్ని కొలిచేందుకు మనిషి చేతిలో మంత్రం, వృత్తాకార యంత్రం. వృత్తం - ఆద్యంత రహితం. కాలమూ అంతే - అనంతం. అయినా అనాదిగా దాని అంతు చూడాలని మానవుడి నిరంతర యత్నం. కానీ కాలానికి కళ్ళెమేయటం అతడికి సాధ్యమా? జరగబోయేది మార్చటం అతడి తరమా? కాలమూ దాన్ని కొలిచే యంత్రమూ వృత్తంలా ఉండటం కాకతాళీయమా? కొలవడమే తప్ప కాలాన్ని గెలవలేరనేదానికి సంకేతమా?`

సీతారామ్‌కి సగమే అర్ధమయింది, సగం కాలేదు. అప్పుడప్పుడూ అలా ఆంగ్ల సినిమాల్లోలా అర్ధమయ్యీ కాకుండా మాట్లాడ్డం రెడ్డి కలవాటు. వాటిని అలా విని ఇలా వదిలేయటం సీతారామ్‌కీ అలవాటు. ఇప్పుడూ అదే పని చేస్తూ, మరో సారి వాచ్‌లో సమయం చూసుకుని తలతిప్పి హోటల్ బయటికి చూశాడు. రెడ్డి కూడా అటే చూశాడు. బిజీ బిజీగా ఉందక్కడ. హోటల్ ఎదురుగా - రోడ్డవతల - ఓ కిళ్ళీ బంక్ ఉంది. బంక్ ముందు భాగంలో వారపత్రికలు, వక్కపొడి, పాన్ పరాగ్ పాకెట్లు వగైరా తోరణాల్లాగా వేలాడుతున్నాయి.

కాసేపటే చూసి రెడ్డికేసి తిరిగి తటపటాయిస్తూ అన్నాడు సీతారామ్, ‘కలలు నిజమవటం గురించి నీ అభిప్రాయమేమిటి?‘. ఆ మాటంటూ అప్రయత్నంగా గోళ్ళు కొరకటం మొదలెట్టాడు. ఉద్విగ్నత, ఆందోళన ఆవరించినప్పుడు చాలామంది చేసే పనే అది.

విసుగు దాచుకుంటూ చెప్పాడు రెడ్డి, ‘కలలు కనండి, వాటిని నిజం చేసుకోండి అన్నాడో పెద్దాయన. అంతా మన చేతిలోనే ఉంది‘.

‘ఆ టైపు కలలు కాదు. నేనేది హిట్లర్ కొచ్చిన కలలాంటివి. భవిష్యత్తులో జరగబోయేది కలలో కనిపిస్తుందా?‘

అడాల్ఫ్ హిట్లర్ – మొదటి ప్రపంచ సంగ్రామం నాటికి జెర్మనీ సైన్యంలో ఓ కింది స్థాయి సైనికుడు. ఆ యుద్ధం తీవ్రంగా జరుగుతున్న రోజుల్లో, ఓ రాత్రి తనున్న బంకర్ లావాతో కప్పబడిపోయినట్లు పీడకల రావటంతో నిద్రలేచి బంకర్ బయటికొచ్చాడతను. కాసేపటికే ఆ బంకర్ పై శత్రుసేన కురిపించిన బాంబుల వర్షం అందులో నిద్రిస్తున్న హిట్లర్ తోటి సైనికుల్నందర్నీ బలిగొంది. సీతారామ్ ప్రస్తావించింది ఆ కల గురించి.

‘నాన్సెన్స్. యుద్ధరంగంలో సైనికులందర్నీ చావు భయం వెంటాడుతూనే ఉంటుంది. వాళ్ళకి అలాంటి కలలు రావటం సహజమే. హిట్లర్ కల నిజమవటం కాకతాళీయం‘, ఈ సారి విసుగు దాచుకునే ప్రయత్నం చెయ్యలేదు రెడ్డి. విశేషముందని పిలిపించి తీరా వచ్చాక పొంతనలేని ప్రశ్నలతో పొద్దుబుచ్చుతున్న స్నేహితుడిపై పీకలదాకా కోపం వస్తుందతడికి.

బదులుగా నవ్వాడు సీతారామ్. ‘ప్రతిదానికీ ఏదో ఒక శాస్త్రీయ సమాధానం చెప్పాల్సిందేనా? తర్కానికందనివెన్నో ఉన్నాయిా లోకంలో. ఆధారాల్లేకుండా దేన్నీ నమ్మవా నువ్వు?‘

సీతారామ్‌కేసి ఓసారి సూటిగా చూసి చెప్పాడు రెడ్డి, ‘ఎందుకు నమ్మను. ఈ విశ్వంలో జరిగే ప్రతి సంఘటన వెనుకా ఒక కారణముంది, ఓ నిర్దిష్ట లక్ష్యముంది అని నమ్ముతాను. ఉదాహరణకి, నువ్వలా గోళ్ళు కొరుక్కోవడం వెనకా నీకే తెలీని కారణమేదో ఉంటుంది. రేపెప్పుడో ఆ అలవాటే నీ కొంపలు ముంచొచ్చు. ఎవ్రీథింగ్ హేపెన్స్ ఫర్ ఎ రీజన్. విధి, తలరాత, డెస్టినీ – పేరేదైతేనేం – ప్రతిదీ అలా జరగాలని ముందే నిర్ణయించబడుతుంది, అదలా జరిగే తీరుతుంది. కాబట్టి భవిష్యత్తు తెలుసుకోవాలి, దాన్ని మార్చాలి అనే ప్రయాస వృధా.‘

చప్పున నోట్లో నుండి వేళ్ళు తీసేశాడు సీతారామ్. ఇబ్బందిగా నవ్వుతూ వాదన కొనసాగించాడు, ‘మరి హిట్లర్ మార్చాడుగా. ఆ కల పట్టించుకోకుండా బంకర్లోనే ఉండిపోతే చరిత్ర మరోలా ఉండేది కాదా?‘

కుర్చీలో అసహనంగా కదిలాడు రెడ్డి. ఇలాంటి చర్చలు ఒక పట్టాన తెగవని అతనికి తెలుసు. దాన్నంతటితో ముగిస్తూ అన్నాడు, 'ఈ సోదంతా ఎందుగ్గానీ, అసలెందుకు పిలిచావో చెప్పు ముందు. అవతల నాకు ముఖ్యమైన పనులున్నాయి‘.

రెడ్డికి సమాధానం దాటవేస్తూ మరోసారి వాచ్‌లో సమయం చూసుకుని పైకి లేచాడు సీతారామ్. 'ఇక్కడే ఉండ్రా. ఇప్పుడే వస్తా' అని చెప్పి బయటకెళ్ళాడు. నేరుగా బంక్ దగ్గరకెళ్ళి ఏదో కొనుగోలు చేసి రెండే నిమిషాల్లో వెనక్కి తిరిగొచ్చాడు.

'పాన్ పరాగ్ అలవాటెప్పటినుండీ?' కష్టపడి నవ్వుతూ అడిగాడు రెడ్డి.

'నేకొన్నది అదికాదులే. ఇది' అంటూ చేతిలో ఉన్న కాగితం ముక్క ఎత్తి చూపించాడు సీతారామ్.

'లాటరీ టికెట్! ఈ పిచ్చెప్పటినుండీ?', రెడ్డి ముఖంలో నవ్వు మాయమైంది. అతనికి లాటరీలు, జూదాల్లాంటి ఈజీ మనీ మార్గాలంటే మా చెడ్డ చిరాకు.

'పిచ్చేం కాదులే. ఎందుకో ఈ టికెట్‌కి లాటరీ తగులుతుందనిపించింది. అందుకే కొన్నా', సీతారామ్ గొంతులో ఏదో దాస్తున్న తడబాటు. వెంటనే పట్టేశాడు రెడ్డి దాన్ని.

'అసలు సంగతి చెప్పు. ఎవడో జ్యోతిష్యుడో, హస్త సాముద్రికం వాడో చెప్పుంటాడు అవునా?', సూటిగా అడిగేశాడు రెడ్డి.

అటూ ఇటూ చూసి రహస్యం చెబుతున్నట్లు ముందుకొంగాడు సీతారామ్. 'అలాంటిదే ఇప్పుడు నీకో రహస్యం చెపుతా, ఎవరికీ చెప్పకూడదు'

రెడ్డికి హఠాత్తుగా తను మానుకునొచ్చిన పనులు గుర్తొచ్చాయి. సీతారామ్ ఏదో విశేషం చెబ్తానంటే పనులు మానుకుని పరిగెత్తుకొచ్చాడు తను. తీరా చూస్తే వీడు చెబుతుంది చిలక జోస్యాల గురించిన కాలక్షేపం కబుర్లు. తన్నుకొస్తున్న కోపాన్ని తొక్కి పడుతూ రెండు క్షణాలపాటు స్నేహితుడికేసి సూటిగా చూసి నోరు విప్పాడు.

'ఏంటా రహస్యం?' రెడ్డి గొంతులో అసహనం. విసుగ్గా సెల్‌ఫోనులో టైమెంతయిందో చూసి టేబుల్ మీద పెట్టేశాడు. 'చాలామందిని కలిసే పనుంది. ఎవడో ఒకడు అప్పివ్వకపోతాడా అని ఆశ. త్వరగా నీగోలేంటో చెప్పేస్తే నే వెళతా.'

'వాళ్ళ సంగతి మర్చిపో ఇక. వాళ్ళతో పన్లేదు మనకి', తొందరలేనట్టు తాపీగా చెప్పాడు సీతారామ్.

అయోమయంగా చూశాడు రెడ్డి. అతనికి అరికాల్లో మంట మొదలైంది. అది నెత్తికెక్కటానికి ఎక్కువసేపు పట్టదని సీతారామ్‌కి అర్ధమైంది. వెంటనే మరోసారి తమనెవరూ గమనించటం లేదని నిర్ధారించుకుని చెప్పటం మొదలు పెట్టాడు. 'నాకు దివ్యదృష్టి వచ్చిందిరా.'

'వాట్! తిక్క మాటలాపి అసలిక్కడికి నన్నెందుకు రమ్మన్నావో చెప్పు'

'నిజంరా. నాకో కలొచ్చింది. అందులో నేనీ బడ్డీ కొట్లో లాటరీ టికెట్ కొన్నట్లు, దానికి పాతిక లక్షల ఫస్ట్ ప్రైజ్ తగిలినట్లూ కనిపించింది'

'అందుకని నువ్వొచ్చి ఇప్పుడు టికెట్ కొనేశావన్నమాట. ఆ మాత్రానికే అది దివ్యదృష్టి అనెలా చెబుతావ్? నీకు లాటరీ తగలాలి కదా'

'ఏమో? తగులుతుందని నాకు నమ్మకం ఉంది.'

'ఎందుకో అంత నమ్మకం?'

'నేను ఈ రోజు ఈ టైముకి ఇదే కిళ్ళీ కొట్లో లాటరీ టికెట్ కొన్నట్లు కలొచ్చింది'

'నాకు మాత్రం, కలలో జరిగింది కాబట్టి నువ్వా పని చేసినట్లనిపిస్తుంది కానీ జరగబోయేది నీ కలలో వచ్చినట్లనిపించటంలా'

'సరే, నేను కావాలనే వెయిట్ చేసి మరీ కలలో వచ్చిన టైముకే వెళ్ళి టికెట్ కొన్నాననుకుందాం. మరి వాడు నాకు అదే నంబర్ టికెట్ ఇవ్వటమేంటి?', టికెట్ మీదున్న నంబర్ కేసి తదేకంగా చూస్తూ చెప్పాడు సీతారామ్.

'రబ్బిష్. అసలు కలలో కనబడ్డ నంబర్ ఇది కాకపోవచ్చుగా. అంత వివరంగా ఎవరికీ కలలు గుర్తుండవు. అంతా నీ భ్రమ. ఈ టికెట్ నంబరూ, కలలో టికెట్ నంబరూ ఒకటే అని నువ్వనుకుంటున్నావు. దీనికి మళ్ళీ దివ్యదృష్టంటూ పేరొకటి'

'లేదురా, అచ్చంగా ఇప్పుడు చేసినట్లే కలలో కూడా రిస్ట్ వాచ్‌లో టైం చూసుకుని మరీ వెళ్ళి అతని దగ్గరే ఇదే నంబర్ టికెట్ కొన్నా. నిజంగా జరిగినట్లే అనిపించింది. ఐనా, రేపొద్దుటి దాకా ఆగు. నే చెప్పేది నిజమో కాదో తేలిపోతుంది'.

'రేపు డ్రానా?'

'నో. ఈ సాయంత్రమే. రేప్పొద్దున పేపర్లో ఫలితాలొస్తాయి'

'ఇంతకీ ఎప్పుడొచ్చింది కల?'

'నీకు ఫోన్ చేసే ముందే ఈ రోజు ఆఫీస్ లేదు కదా. లంచ్ చేసొచ్చి కాసేపు పడుకున్నా. అపుడొచ్చింది.'

'గ్రేట్! గుడ్ లక్. ఇక ఇంటికెళ్ళి బబ్బుని మరిన్ని పగటి కలలు కనే పన్లో ఉండు. నేనెళ్ళి అప్పులడుక్కునే పనిలో ఉంటా. మళ్ళీ ఇలాంటి తిక్క పనుల కోసం ఫోన్లు చేసి పిలిస్తే మక్కెలిరగదంతా', లేచి వెళుతూ చెప్పాడు రెడ్డి. 'చాయ్ బిల్లు కట్టెళ్ళు' నాలుగడుగులేశాక ఆగకుండానే వెనుదిరిగి చెప్పాడు.

❀ ❀ ❀

మర్నాటి ఉదయం - పదింబావుకి రెడ్డికి ఫోనొచ్చింది. వింటున్నది నమ్మలేకపోయాడతను. అవతల సీతారామ్ ఆనందంతో కేకలు పెడుతున్నాడు. కలగన్నట్లే అతని టికెట్‌కి పాతిక లక్షల బంపర్ బహుమతొచ్చింది! ఉన్న పళాన రూముకి పరుగెత్తుకెళ్ళాడు రెడ్డి. న్యూస్ పేపర్ పట్టుకుని ఆనంద తాండవం చేస్తున్నాడు సీతారామ్. పేపర్లో నంబరు, టికెట్ మీది నంబరూ మార్చి మార్చి చూసి పోల్చుకున్నాక గానీ అది నిజమేనన్నది నమ్మలేకపోయాడు రెడ్డి. ఇద్దరూ పట్టరాని సంతోషంతో గంతులేశారు. కాస్త స్థిమిత పడ్డాక కుర్చీల్లో కూలబడ్డారు. మెల్లిగా - ఇదంతా నిజమే అన్న నమ్మకం కుదిరింది వాళ్ళకి.

'దివ్యదృష్టంటే నమ్మలేదుగా ఏమంటావిప్పుడు?' అన్నాడు రెడ్డికేసి చూస్తూ సీతారామ్.

'ఇప్పుడూ అదే అంటా. కో ఇన్సిడెన్స్, అదృష్టం, నసీబ్, రాత .... ఏదైనా అనుకో. దివ్యదృష్టి, దూరదృష్టి అంటే మాత్రం నేనొప్పుకోను' ఓటమినొప్పుకోలేదు రెడ్డి.

'సర్లే పేరేదైతేనేం. పాతిక లక్షలొచ్చాయి. అది ముఖ్యం' కులాసాగా అన్నాడు సీతారామ్.

'కంగ్రాట్స్', రెడ్డి గొంతులో లీలగా తొంగిచూసిన అసూయ సీతారామ్‌కి అర్థమైంది.

'రేయ్. ఈ పాతిక లక్షలూ ఏం చేయబోతున్నానో తెలుసా?'

'ఏం చేస్తావు?'

'నీకిచ్చేస్తా. ఆ రియల్టర్‌గాడి మొహాన కొట్టి పార్టనర్‌గా చేరిపో'

నమ్మలేకపోయాడు రెడ్డి. నిజమా అన్నట్లు చూశాడు సీతారామ్‌కేసి. స్నేహితుడి ముఖంలో కనబడ్డ నిజాయితీ అది నిజమేనని చెప్పింది. కృతజ్ఞత, ఉద్వేగం కలిసిపోయి మాటలు కరువయ్యాయి రెడ్డికి. 'థాంక్స్' కూడా అనలేకపోయాడు.

రెండువారాల్లో లాటరీ డబ్బులొచ్చేశాయి. పేరుకి బహుమతి పాతిక లక్షలైనా పన్నులు పోగా చేతికొచ్చింది దగ్గర దగ్గర ఇరవై. అన్న మాట ప్రకారం అదంతా రెడ్డి చేతిలో పెట్టాడు సీతారామ్. తనెంత పెద్ద తప్పు చేస్తున్నాడో అప్పుడతనికి తెలీదు.

అవసరమైన దానికన్నా ఎక్కువ డబ్బే దొరకడంతో వేరే వాడితో భాగస్వామిగా చేరకుండా సొంతగానే వ్యాపారం మొదలు పెట్టాడు రెడ్డి. అదృష్టం వల్లనో, కష్టపడే తత్వం వల్లనో, వ్యాపారంలో పట్టిందల్లా బంగారమైందతనికి. ఏడాది తిరిగే లోపే నగరంలో ప్రముఖ రియల్టర్లలో ఒకడుగా మారిపోయాడు. సీతారామ్ సాయానికి బదులుగా తన వెంచర్లలో నుండి ఏరి కోరి ఒక మంచి డబల్ బెడ్ రూం అపార్ట్‌మెంట్‌ని బహుమతిగా ఇచ్చాడు. ఈ ఏడాదిలో రెడ్డికి వివాహమయ్యింది. తన ఆఫీసుకి దగ్గర్లో పెద్ద ఇల్లు అద్దెకి తీసుకుని కాపురం పెట్టాడు. సీతారామ్ కూడా గది ఖాళీ చేసి అపార్ట్‌మెంట్‌లోకి మారిపోయాడు. అందులో కొచ్చిన కొన్ని రోజులకే అతనికి పదోన్నతి లభించింది. దాంతో అతనికా అపార్ట్‌మెంట్ కలిసొచ్చిందనే నమ్మకం ఏర్పడింది. ఇంట్లో వాళ్ళు పెళ్ళి సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. మరో ఏడాది గడిచింది. రెడ్డి వ్యాపారం మరింత పెరిగింది. ఇద్దరు భాగస్వాముల్నీ చేర్చుకున్నాడు. సొంతిల్లు కట్టుకుని అందులోకి మారిపోయాడు.

❀❀❀

నాటికి - సీతారామ్ లాటరీ గెలిచినట్లు కలొచ్చి సరిగా రెండేళ్ళు. స్నేహితులిద్దరికీ ఆ తేదీ గుర్తుంది. సీతారాంకి పట్టిన అదృష్టం తన జీవితాన్ని మేలుమలుపు తిప్పింది కాబట్టి అది రెడ్డికి కాస్త ఎక్కువ గుర్తున్న తేదీ. ఆ కలతో సీతారామ్ జీవితం పెద్దగా మారిందేమీ లేదు, కానీ ఆ అనుభవంతో అన్నీ కాకపోయినా కొన్ని కలలు నిజమౌతాయనే నమ్మకం బలపడిందతనికి. అప్పట్నుండీ తనకొచ్చిన ప్రతి అందమైన కలా నిజమౌతుందేమోనని నిరీక్షించటం అలవాటైపోయిందతనికి. ఐతే ఈ రెండేళ్ళలో అతనికొచ్చిన పదుల కొద్దీ కలల్లో ఈడేరిందొకటీ లేదు. ఎటువంటి కలవరాలు, కలకలాలూ లేకుండా జీవితం సాఫీగా సాగిపోతుండగా ఆ రోజు ....

.... కీచు గొంతుతో అరుస్తూ మేల్కొన్నాడు సీతారామ్. కాసేపు తనెక్కడున్నాడో అర్ధంకాలేదు. వళ్ళంతా చెమటలు పట్టేశాయి. గుండె వేగంగా కొట్టుకుంటుంది. తన బెడ్ రూములోనే ఉన్న సంగతి అర్ధమవ్వటానికతనికి అరనిమిషం పట్టింది. ఈలోగా దడ తగ్గింది. లేచి కిచెన్‌లో కెళ్ళి ఫ్రిజ్‌లో నుండి మంచి నీళ్ళ సీసా తీసుకుని గటగటా తాగేశాడు. అప్పటికి అతను పూర్తిగా కుదుటపడ్డాడు. లివింగ్ రూంలోకొస్తూ తలెత్తి గోడగడియారం కేసి చూశాడు. మధ్యాహ్నం ఒకటిన్నర కావస్తోంది. ‘అదే‘ అనుకున్నాడతను గడియారాన్నే చూస్తూ, ఏదో గుర్తు చేసుకోడానికి ప్రయత్నిస్తూ.

అతన్నంత గాభరా పెట్టింది- ఆఫీసుకి సెలవు కదా అని కునుకు తీస్తుంటే వచ్చిన పీడకల. కలలా లేదది. కళ్ళెదురుగా జరిగుతున్నట్లే ఉంది. రెండేళ్ళనాటి లాటరీ కల కనిపించినంత నిజంగానూ అనిపించిందిది. కానైతే దానంత సుందర స్వప్నం కాదిది. తలచుకోగానే అతని వెన్ను జలదరించింది. కలలో కనపడ్డ దృశ్యాలు మాంటేజ్ షాట్లలా వేగంగా అతని కళ్ళ ముందు మెదిలాయోసారి.

తనో గోడగడియారం కేసి భయంగా చూస్తున్నాడు. అలా ఎంతసేపు చూశాడో .... నిమిషమా? రెండు నిమిషాలా? కలలో సన్నివేశాలు రియల్ టైములో నడుస్తాయా? అంతలో పక్కనేదో శబ్దమయింది. తిరిగి చూస్తే నాలుగడుగుల దూరంలో ఓ అపరిచితుడు. భావరహితంగా తనకేసే చూస్తున్న అతని ముఖంలో మూర్తీభవించిన క్రూరత్వం. ఏ భావమూ లేని ముఖంలో క్రూరత్వం కనపడటమేంటి? అతని ముఖకవళికలెప్పుడూ అంతే ఉంటాయా? అంతలో... క్లోజప్పులో అతని చెయ్యి. చేతిలో ఏంటది? తుపాకి!?! వెంటనే క్లోజప్‌లో తన ముఖం. చెమటలెప్పుడు పట్టాయి? ధారగా కారిపోతున్నాయి. మళ్ళీ తుపాకి క్లోజప్, ఈసారది పేలినట్లుంది. కళ్ళముందు మెరుపు. శబ్దమేమీ వినిపించలేదు. పెద్దకేకతో తను కిందకి వాలిపోతున్నాడు. ఇప్పుడూ శబ్దం లేదు. ఇంతకీ గుండు తనకి తగిలిందా లేదా? తగిలిందేమో. లేకపోతే కిందెందుకు పడతాడు? తర్వాతేమయింది?... పెద్ద కేకతో మెలుకువచ్చేసింది.

'అదే గడియారం', మళ్ళీ అనుకున్నాడు గోడగడియారాన్ని తదేకంగా చూస్తూ. కలలో కనపడ్డ సమయమూ, తేదీ కూడా గుర్తున్నాయతనికి. ఇదే రోజు, మధ్యాహ్నం మూడూ ఇరవై ఒకటి! లాటరీ కలలో కూడా ఇంతే. అప్పుడూ ఇలాగే రిస్ట్ వాచ్, అందులో నాటి తేదీ, సమయమూ కూడా గుర్తున్నాయతనికి. అందులోనూ తను కాక మరో వ్యక్తి ముఖం కనపడింది. కాకపోతే అప్పుడా కిళ్ళీ కొట్టతను, ఇప్పుడెవరో అపరిచితుడు. ఎవరతను? తననెందుకు కాల్చాడు?

'ఎవరు, ఎందుకు' గురించి మరీ ఎక్కువ ఆలోచించలేదు సీతారామ్. అతని మదిలో ప్రస్తుతం ఒకటే ప్రశ్న, ‘ఈ కల కూడా నిజమవనుందా?‘ రెండేళ్ళ నాటి కలకీ నేటి దుస్వప్నానికీ ఉన్న పోలికలు గమనించేసరికి ఇదీ నిజమవుతుందేమోననే అనుమానం మొలకెత్తింది. క్షణంలో అది గట్టిపడి నమ్మకంగా మారింది. అంతలో స్ఫురించింది - అదీ ఇదీ ఒకే రోజు, ఇంచుమించు ఒకే సమయంలో వచ్చాయని. ఒక్కసారిగా గుండె దడ హెచ్చిందతనికి. వళ్ళంతా చెమటలు పట్టాయి. కాళ్ళలో వణుకు మొదలయింది. అప్పుడే ఒకటిన్నరవుతుంది, ఇంకా రెండూ గంటలు కూడా లేదు.

'ఏం చెయ్యాలిప్పుడు? ఎలా తప్పించుకోటం? జరగబోయేదాన్ని ఆపటం తనవల్ల అవుతుందా?' అతని బుర్రలో రకరకాల ఆలోచనలు సుడులు తిరగసాగాయి. 'రెడ్డిని సలహా అడిగితే?'

అంతలో గుర్తొచ్చింది. ఆ రోజు రెడ్డి కుటుంబసమేతంగా తిరుపతి వెళుతున్నాడని నిన్ననే ఫోన్ చేసి చెప్పాడు. నెలక్రితం వాళ్ళ కన్‌స్ట్రక్షన్ సైట్లో పెద్ద ప్రమాదం తప్పించుకున్నాడు రెడ్డి. అప్పట్నుండీ అతని భార్య ఒకటే పోరు - 'తిరుపతెళ్ళి మొక్కు తీర్చుకునొద్దాం' అంటూ. వాళ్ళ పెళ్ళైన కొత్తలో చేసుకున్న మొక్కట, ఇంకా తీర్చలేదు కాబట్టే ప్రమాదం జరిగిందని ఆమె నమ్మకం.

తీర్థయాత్రకెళుతున్న వాళ్ళకి తన పీడకల గురించి చెప్పి బెదరగొట్టటం ఎందుకని కాసేపు తటపటాయించాడు సీతారాం. కానీ టెన్షన్ అంతకంతకీ ఎక్కువైపోతుంటే ఇక తప్పక ఫోనందుకున్నాడు.

⁂

తిరుపతి వెళుతుండగా మార్గమధ్యంలో రెడ్డి ఫోన్ మోగింది. అవతల నుండి సీతారామ్ గొంతు ఆందోళనగా వినిపిస్తుంది. డ్రైవర్‌కి కారాపమని చెప్పి కిందకి దిగాడు. వణికే గొంతుతో సీతారామ్ చెప్పిన విషయం విని నవ్వాడు.

'ఏం రా. పీడకలొస్తే చిన్నపిల్లల్లా భయపడిపోతే ఎలా?' అంటూ స్నేహితుడి భయాన్ని కొట్టిపారేశాడు.

'లేదురా. ఇది మామూలు కల కాదు. పోయినసారిలా గడియారం, టైము, స్థలం వివరంగా కనిపించాయి. అందుకే ఇదీ నిజమే అవుతుందనిపిస్తుంది' సీతారామ్ ఇంకా భయంగానే చెప్పాడు.

ఏదో అనబోయాడు రెడ్డి. అంతలోనే సీతారామ్ మళ్ళీ అందుకున్నాడు, 'గుర్తుందా? లాటరీగురించి కలొచ్చి ఈ రోజుకి సరిగ్గా రెండేళ్ళు. ఇది కూడా సరిగా అదే టైముకొచ్చింది. పైగా అప్పుడూ ఇప్పుడూ గడియారంలో ఒకే టైం కనిపించింది, సరిగా మధ్యాహ్నం మూడూ ఇరవై ఒకటి!'

గట్టిగా నవ్వాడు రెడ్డి. 'యానివర్సరీ సెలబ్రేషన్ అన్నమాట. లాటరీ కల గురించి ఒకటే గుర్తుచేసుకుంటుంటావు కదా. అది నీ బుర్రలో పాతుకుపోయి ఈ రకంగా మరో కలొచ్చేసింది. దాని గురించి మరీ ఎక్కువ ఆలోచించి బుర్ర పాడు చేసుకోకు. ఐనా నేనప్పుడే చెప్పా కదా లాటరీ కల కేవలం కో ఇన్సిడెన్స్ అని'

కొన్ని క్షణాల తర్వాత సీతారామ్ గొంతు వినిపించింది. ఇప్పుడు కొంత స్థిమితపడ్డట్లున్నాడతను. ఐనా అతని గొంతులో ఇంకా భయం.

'అంతేనంటావా?'

'అంతే, ఇంకా భయమైతే ఓ పని చెయ్', రెడ్డి చెప్పాడు కార్లోంచి 'ఇంకెంత సేపు' అన్నట్లు తొంగి చూస్తున్న భార్యకేసి 'రెండు నిమిషాలే' అన్నట్లు సైగ చేస్తూ.

'ఏంటది?'

'మా డూప్లికేట్ కీ నీ దగ్గరే ఉంది కదా. అది తీసుకుని ఇప్పుడే బయల్దేరి మా ఇంటికెళ్ళిపో. సాయంత్రం దాకా అక్కడే కాలక్షేపం చెయ్యి. ఆ తర్వాతెక్కడికెళతావో నీ ఇష్టం. ఈ రోజు మూడూ ఇరవై ఒకటికి మాత్రం నీ అపార్ట్‌మెంట్‌లో ఉండకు. అర్థమైందా?'

'యస్, యస్' సీతారామ్ గొంతులో ఈ సారి కొంత ధైర్యం ధ్వనించింది.

'క్రితంసారి - జరగబోయేది తెలుసుకుని చేసేదేంటని నేనంటే, చెడు జరగబోతోందని ముందే తెలిస్తే దాన్ని ఆపొచ్చు కదా అన్నావు గుర్తుందా? కలలు నిజమౌతాయనేది నేన్నమ్మను కానీ, ఏమో, ఈ కల రావటం నీ మంచికే కావచ్చు. నువ్వైతే ప్రశాంతంగా ఉండు. ఇంట్లో బోలెడన్ని డీవీడీలున్నాయి, శుభ్రంగా పెట్టుకుని చూడు', అంటూ సీతారామ్‌కి మరింత ధైర్యం నూరిపోసి ఫోన్ పెట్టేశాడు రెడ్డి.

సీతారామ్ దృష్టి పదే పదే రిస్ట్ వాచ్ మీదకి పోతూంది. రెడ్డి ఇంట్లో కాలుగాలిన పిల్లిలా పచార్లు చేస్తున్నాడతను - గోళ్ళు కొరుకుతూ. అక్కడికొచ్చి అరగంటయింది. రెడ్డి ఫోన్ పెట్టేసిన వెంటనే ఆలస్యం చెయ్యకుండా అపార్ట్‌మెంట్ తాళం వేసి బయలుదేరాడు. దారి పొడుగూతా ఆ పీడకలే అతన్ని వెంటాడింది. 'రెడ్డి చెప్పినట్లు కలలు నిజమవటం కేవలం కాకతాళీయమా? అదే నిజమైతే ఎంత బాగుండు?', ఈ మాట అప్పటికెన్ని సార్లనుకున్నాడో. భయంగా మరోసారి రిస్ట్‌వాచ్ చూసుకున్నాడు. మూడూ ఇరవై కావస్తూంది. అతని గుండె ఝల్లుమంది.

'ఇంకొక్క నిమిషం' అనుకున్నాడు కళ్ళుమూసుకుని. తన గుండె వేగం హెచ్చటం తెలుస్తుంది. కొద్ది క్షణాలాగి మెల్లిగా కళ్ళు తెరిచి మళ్ళీ వాచ్ చూశాడు. మరో నలభై సెకన్లు మాత్రమే మిగిలున్నాయి. ఊపిరి బిగబట్టి తదేకంగా వాచ్ కేసే చూడసాగాడు. ఇంట్లో అలుముకున్న నిశ్శబ్దం దాని టిక్ టిక్ శబ్దాన్ని రెట్టింపు చేస్తుండగా అతడి నుదుటిపై మొదటి చెమట చుక్క ప్రత్యక్షమయింది. కాసేపట్లో అతని గుండె దడ కూడా అతనికే వినిపించటం మొదలయింది. నుదుటిపై మరిన్ని చెమట చుక్కలు మెరిశాయి. క్షణాలు యుగాల్లా గడవటం అంటే ఏమిటో అనుభవంలోకొస్తుండగా....వాచ్ ముళ్ళు మూడూ ఇరవై ఒకటి చేరుకున్నాయి.

తర్వాత నిమిషం నరకంలా గడిచిందతనికి. చూపింకా వాచ్ మీదనే ఉన్నా అందులో అతనికి క్లోజప్‌లో కనిపిస్తూంది ఆ అపరిచిత వ్యక్తి ముఖం. ఒకవైపు తనున్నది తన అపార్ట్‌మెంటులో కాదన్న భరోసా, మరో పక్క 'అతను నేనిక్కడున్న సంగతెలాగోలా తెల్సుకుని వచ్చేస్తే' అన్న భయం. ఈ టెన్షన్ భరించేకన్నా ఉన్నపళాన భూమి చీలి తనని లాక్కుపోతే బాగుండనుకున్నాడు. అతనా భయంలో ఉండగానే వాచ్ మూడూ ఇరవై రెండు చూపించింది.

భయపడ్డ సమయం రానూ వచ్చింది, పోనూ పోయింది. భూమి చీలలేదు, తుపాకీ పేలలేదు. అంతా మామూలుగానే ఉంది! సీతారామ్‌ని బోలెడు ఆశ్చర్యం, కొద్దిపాటి ఆనందం ఆవరించాయి. అయినా అతనిలో ఇంకా ఏమూలో కాస్త అపనమ్మకం. అందుకే ఇంకా కుదురుగా కూర్చోలేక పచార్లు చెయ్యసాగాడు. రెండు నిమిషాలగ్గానీ పూర్తిగా కుదుటపడలేదు. అప్పటికి, ఇక భయంలేదని పూర్తి నమ్మకం కుదిరింది. టెన్షన్ మటుమాయమైపోయింది. ఆనందంతో నాట్యం చెయ్యాలనిపించింది. చేసేశాడు కూడా.

ఎంతసేపలా ఎగిరాడో గుర్తులేదు. చివరికి అలిసిపోయి సోఫాలో కూలబడ్డాడు. గుండెల నిండా ఊపిరి పీల్చుకుంటూ వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు. అతని మనసెంతో తేలికయిందిప్పుడు. భయమంతా చేత్తో తీసేసినట్లు మాయమైపోగా అతనికి తెరలు తెరలుగా నవ్వొచ్చింది. మధ్యాహ్నం నుండీ అప్పటిదాకా పడ్డ టెన్షన్ మరోమారు తలుచుకుని మనసారా నవ్వుకున్నాడు. కొద్దిసేపటి క్రితం దాకా తెగ భయపెట్టిన విషయమే ఇప్పుడు నవ్వించటం తమాషాగా అనిపించిందతనికి. 'రెడ్డి చెప్పిందే నిజం. నా పిచ్చి కానీ కలలు నిజం కావటమేమిటి? వెర్రి నమ్మకాలు పెట్టుకుని హడలి చచ్చాను' అనుకుంటూ కళ్ళు తెరిచాడు. తెరిచీ తెరవగానే అతడి దృష్టిలో పడింది

సీలింగ్‌కి రెండడుగులు కిందగా తగిలించున్న గోడగడియారం. అదే గడియారం! ‘ఒకటి కొంటే మరోటి ఉచితం‘ అనుంటే కొన్నాడు వాటిని. ఒకటి తనుంచుకుని రెండోది రెడ్డికిచ్చాడు. మూడేళ్ళనాటి సంగతది.

సీతారామ్ భృకుటి ముడిపడింది. రెండు క్షణాలపాటు అదేమిటో అర్థం కాలేదు కానీ ఏదో సరిగా లేని ఫీలింగ్. ఏదో పొరపాటు జరిగింది. ఏమిటది? అంతలోనే అర్థమయింది. పాత అలవాటది. అది గుర్తుకురాగానే ఒక్కసారిగా వళ్లు జలదరించింది, వెన్నులోనుండి వణుకు పుట్టుకొచ్చింది. ముఖంలో రంగులు మారుతుండగా, గాభరాగా తన రిస్ట్ వాచ్ కేసి చూసుకున్నాడు. మూడూ ముప్పై ఒకటి చూపిస్తోందది. దిగ్గున సోఫాలోంచి లేచి రెండడుగులు ముందుకేసి తలెత్తి గోడ గడియారం కేసి చూశాడు - నమ్మలేనట్లు. అందులో సమయం మూడూ ఇరవై ఒకటి!

సీతారామ్ నెత్తిన పిడుగులు పడిన అనుభూతి. పంక్చువాలిటీ పేరుతో గడియారం పది నిమిషాలు ముందుకు జరిపే అలవాటు ప్రాణాలమీదకి తెచ్చిందా! అతని ముఖంలో నెత్తుటి చుక్కలేదు. పదినిమిషాల క్రితం మాయమైన ప్రాణభయం పదిరెట్లెక్కువ మోతాదులో మళ్ళీ కమ్ముకుంది. తన మతిమరుపుని నిందించుకుంటూ చేష్టలుడిగి గోడ గడియారం కేసే చూస్తుండగా .... కుడివైపు శబ్దమయింది. కలలో ఉన్నవాడిలా తల తిప్పి అటు చూశాడు సీతారామ్. నాలుగడుగుల దూరంలో నిలబడున్నాతడు .... ముఖంలో అదే క్రూరత్వం, చేతిలో అదే నాటు తుపాకీ. తుపాకీ గొట్టం కేసి చూస్తూ సీతారామ్ గడ్డకట్టుకుపోయాడు. ఆ క్షణంలో - అతనికి రెడ్డి మాటలు కలగాపులగంగా గుర్తొచ్చాయి, ‘*.. ఆ అలవాటే నీ కొంపలు* ముంచొచ్చు .. *ఎవ్రీ థింగ్ హేపెన్స్ ఫర్ ఎ రీజన్ .. జరగబోయేదాన్ని ఆపటం ఎవరి తరమూ కాదు .. ఒకవేళ ఎవరన్నా అలా చేస్తే ఆ జోస్యం తప్పినట్లే - చెప్పింది జరగలేదు గనక..'*

'కలలు నిజమవటం కాకతాళీయమా? కలల్ని ఇంతలా పట్టించుకోకపోతే ఈ పరిస్థితిలో ఇరుక్కునేవాడిని కానా? భవిష్యత్తుని మార్చే ఆరాటంలో ఆ భవిష్యత్తుకే బాటలు పరిచానా? జరగబోయేది ఆపే యావలో జరగరానిది జరిగేలా చేసుకున్నానా? మృత్యువుని మోసం చేయబోయానా, నేనే మోసపోయానా?‘, రెప్పపాటులో సీతారామ్ మదిలో మెదిలిన ప్రశ్నలివి. మరో క్షణముంటే ఇంకెన్ని మెదిలుండేవో కానీ అంతలోనే అతని కళ్ళముందో మెరుపు మెరిసింది. మెరుపు వెను వెంబడి పెద్ద శబ్దం. వెంట వెంటనే మరో రెండు మెరుపులు, మరి రెండు సార్లు శబ్దం. కిందకి వాలిపోతూ అతను చేసిన ఆర్తనాదం ఆ శబ్దాల్లో కలిసిపోయింది.

(ఉపసంహారం)

విరిగిన ఊచలు, పగిలిన అద్దాలు గుచ్చుకోకుండా జాగ్రత్తపడుతూ కిటికీలోనుండి ఇంటి బయటకి దూకాడతను. తననెవరూ గమనించలేదని రూఢి చేసుకున్నాక జేబులో నుండి చేతిరుమాలు తీసి కిటికీలో వేలిముద్రల్లేకుండా తుడిచాడు. మళ్ళీ ఒకసారి ఎవరూ గమనించలేదని నిర్ధారించుకుని అక్కడనుండి తాపీగా నడవటం మొదలు పెట్టాడు.

అప్పుడప్పుడే డెవలప్ అవుతున్న ధనికుల కాలనీ అది. కాలనీ అంతా పద్ధతిగా వేసిన మట్టి రోడ్లు, వాటి పక్కన వృక్షాలుగా ఎదిగే దశలో ఉన్న మొక్కలు. ఇళ్ళు మాత్రం అక్కడొకటి ఇక్కడొకటీ విసిరేసినట్లున్నాయి. రోడ్డు పై పెద్దగా జనసంచారం కానీ, వాహనాల రద్దీకానీ లేదు. ఫర్లాంగు దూరం నడిచాక అక్కడ పార్క్ చేసున్న పాత అంబాసిడర్‌లో కూర్చుంటూ ఫోన్ తీసి రింగ్ చేశాడు. మొదటి రింగుకే ఎత్తారు అవతలి వాళ్ళు.

కార్ స్టార్ట్ చేస్తూ చెప్పాడతను, 'అన్నా పొరపాటయిందే ఆణ్ణి కాల్చేసినా గానీ తర్వాత జూస్తే ఆడు రియలెస్టేట్ రెడ్డిగాడు గాదే ఎవుడో వేరేవాడు.'

అవతలి వ్యక్తి చెప్పింది విన్నాక తటపటాయిస్తూ మళ్ళీ చెప్పాడు, 'అన్నా నాదో మాటే. రెడ్డిగానిది గట్టి ప్రానం లాగుందే పోయిన్నెల్లో యాక్సిడెంట్ తప్పించుకుండు, గిప్పుడీ అటెంప్టూ తప్పించుకుండు. గీసారి మాత్రం వాడికి మనమీద డౌటొచ్చేది ఖాయం. నా మాటిని మర్డరాలోచన మానుకుని గా పాతికెకరాల గురించి మినిస్టర్ సాబ్‌తో రెడ్డిగానికోసారి చెప్పియ్యరాదె? గోటితో పొయ్యేదానికి గొడ్డలెందుకన్నా?'

ఆ తర్వాత అతని మాటలు కార్ ఇంజిన్ హోరులో కలిసిపోయాయి. ఖాళీ రోడ్డు మీద దుమ్ము రేపుకుంటూ అంబాసిడర్ ముందుకు సాగిపోయింది.